# ఆండాళ్లూ; ఉల్లిపాయలూ

తల నిండుగా గులాబీలను తురుముకొని, నిలువుటద్దం ముందు నించొని, సిడుపాటి వాల్జడ ముందుకు వేసికొని, బంగారపు జడకుచ్చులుకి పూలు బిగిస్తూ, సోగలైన పెద్ద కళ్ళని అటూ ఇటూ త్రిప్పుకుంటూ, తన సౌందర్యానికి తనే ఆశ్చర్యపోతున్నట్లు ఆండాళ్ళు లక్ష్మణాచార్యుల ఆగమనాన్ని కాని, ఆతని చేతిలోని అరటి ఆకు పొట్లాన్ని కాని గమనించ లేదు.

లక్ష్మణం కాస్సేపు భార్య సౌందర్య తృష్ణని గమ నించి చిన్న దగ్గు దగ్గాడు. ఆండాళ్ళు తటాలున వెనక్కి తిరిగి కళ్ళు పెద్దవి చేసుకొని

"మీరా! ఎంతసేపయ్యిందీ వచ్చి?" అని దీర్ఘం తీస్తూ కాఫీ ఫ్లాస్కు టేబుల్ మీద పెట్టింది.

"ఎంతసేపయితేనేంలే! నించుని నించుని నా కాళ్లు పీకెట్టాయ్ కాని, నువ్వు మాత్రం నీ ప్రథమ భర్తమీద ప్రేమ నాకోసం వదలలేవుకదా మరి?" అన్నాడు గంభీరంగా.

ఒక్కసారి అదిరింది ఆండాళ్ళు.

"అదేమిటండీ! మీ మాటలూ, మీరూనూ?" అన్నది భీతలోచనగా.

"కంగారు పడకే కళ్యాణీ! నీ ప్రథమ భర్త యనగా, నీముందు బీరువాలో బిగింపబడ్డ నిలువుటద్దమే కాని వేరు

కాదు. ఆయనగారి తర్వాతనేకదా నేను! నువ్వు కొత్తచీర కట్టుకున్నా, పూలు పెట్టుకున్నా, తిలకం దిద్దినా, కాటుక పెట్టుకున్నా, నీ సర్వాంకారాలు ఆయన సాన్నిధ్యమునకేకదా! ఆయన అనుమతి లేనిదే నావైపు చూడవు మరి?"

"చాలెద్దురూ! మీరు మరీనూ! బొత్తుగా కవీశ్వరులై పోతున్నారు!" అంది సన్నగా నవ్వుకుంటూ.

"రవి కాననిచోటు కవి గాంచునని" మన అయ్యవార్లంగారు (పెద్దలు) సెలవిచ్చారుకదే! నేను కవినికాకేం? మదీయ నామధేయుడు (లక్ష్మణకవి) భర్తృహరిని తెనిగించటంతో సరిపెట్టాడు కాని నేనయితే" రక్తి, భక్తి, ముక్తి శతకాలను స్వయంగానే రచిస్తాను. తెలుసా?" అన్నాడు నవ్వుతూనే. ఆండాళు యథాలాపంగా టేబుల్ మీద ఆకుపొట్లాం చూసింది.

అదేమిటండీ? అంది.

నీకిష్టమైనవే! దేవీ! అన్నాడు చిలిపిగా.

'నాకిష్టమైనవా' అన్నది అనుమానంగా.

ఆండాళు భయపడటానికి కారణంవుంది. అసలు సంగతి ఇదీ. ఆండాళు తొలిసారిగా నీళ్లు పోసుకున్నది. అయిదవ మాసం. అసలే అందమయినదేమో. వేవిళ్ళతో నాజూకుగా కాశీరత్నం తీగలాగ తయారయ్యింది. లక్ష్మణానికి ఆండాళంటే అమితప్రేమ. మేనమామకూతురు. సూలింతరాలు! లక్ష్మణం తల్లిదండ్రులకొక్కడే కొడుకు! పెళ్ళయిన ఏడాదికే వంశోద్ధారకుడు ఉదయించబోతాడు. ఇటు తన

తల్లికీ, అటు మేనత్తకీ ఉత్తరాలు వ్రాశేసాడు ఆండాళు వద్దన్నా వినకుండా.

ఆండాళు నిన్న మధ్యాహ్నం తోచక ఎదురింటి సుభద్రగారింటికి వెళ్లింది. ఆ సమయానికి సుభద్ర బంగాళా దుంపలు, నీరుల్లిపాయలు వేయిస్తోంది. ఆండాళుకి నోరూరి పోతూంది. ఎర్రగా వేగిన బంగాళాదుంప ముక్కలకోసరం కాదు! స్టీలు మూకుడులో తళతళా మెరుస్తూన్న వుల్లి ముక్కల కోసరం. సుభద్ర ఆమాటా ఈమాటా అడుగుతూ తాను చెప్తోంది. అవేం ఆండాళు చెవికెక్కడంలేదు. ధ్యాస అంతా వుల్లిముక్కలమీదేవుంది. అవి తననోట్లో వున్నట్లూ, తను చప్పరిస్తూ, లొట్టలువేస్తూ వాటి తియ్యని రసాన్ని పీలుస్తున్నట్లూ, కొంచెం కారంకూడా తన నాలిక్కి తగిలినట్లూ, వూహిస్తోంది.

"అయిదవ మాసంకూడా వెళ్ళేట్టుందే ఆండాళ్లూ! ఇంకా మీ అమ్మయినా వచ్చారుకాదేం? తొలి చూలివి! ఏం తినాలనుంటుందో! తల్లి దగ్గర వుంటే జిహ్వకి రుచయినవి తెలుసుకు చేసిపెడుతుంది. నీది ఒంటెత్తు కాపురమాయె! పఢుచుల కాపరం చితుకుల మంటాను. నీకేదన్నా తినాలనుంటే నాతో చెప్పు: నేను చేసిస్తాను. పచ్చడే కావాలో, కూరే కావాలో; మా చెల్లి వొకటీ, నీవు వొకటీనా? అయినా చిన్నపిల్లవి. నీకాచారం ఏమిటే? అయినకాడికి మగవాళ్లు హోటళ్ళమట బడి అడ్డమయిన గడ్డీ మేస్తే లేదు

కాని, ఇంట్లో మాత్రం మురిపిళ్లు పెడతారు. వీళ్ళు మహా” అన్నది సుభద్ర ఆప్యాయంగా.

వెంటనే “కాస్త కూరిద్దురూ అక్కయ్యగారూ ?” అనాలనిపించింది. మళ్ళీ ఛ ! ఛ !! ఇంతలో అడిగే దేమిటి ? ఆవిడ వూరంతా టాంటాం వేసేస్తుంది. తనే కొనుక్కొని చేసుకుంటే సరిపోతుంది అని కళ్ళెంతో మనస్సుని కట్టేసుకుని ఇంటికి వచ్చేసింది. భర్త “నీ కిష్టమైనవే వున్నాయ్ ఆ పొట్లంలో” అనేసరికి భర్తకి, తనకు ఉల్లిపాయలమీద మనసుపోయిందని తెలిసిందేమో అని భయపడింది. ఏమంటే ఆండాళుకి కలవరించటం అలవాటు. ఒకరోజు ఎర్ర జరీ చీర మీద మనసుపోయింది. ఆ రాత్రి నిద్దరలో “ఎర్ర జరీ చీర కట్టుకోవాలి. అప్పుడు మీతో సినిమాకు రావాలి” అని కలవరించిందట. ప్రొద్దుట లేస్తూనే బజారుకు పోయి ఎర్రని జరీ చీర తెచ్చారు. అప్పుడూ తానిలాగే అడిగింది ‘ఏమి టని ?’ నీ కిష్టమయినదే ! అన్నారు ఇలాగే, విప్పి చూస్తే ఎర్రని జరీ చీర ! తాను ఆశ్చర్యపోయింది. తర్వాత చెప్పారు తన కలవరింత సంగతి. ఇప్పుడూ తను నిశ్చయంగా కలవరించి వుంటుంది అనుకున్నది ఆండాళు. ఆ ఆకు పొట్లాం విపి చూడ టానికి చేతులు రావటంలేదు. అందులో ఏ పెసరట్లో, ఉల్లి పాయ పకోడీలో వుంటాయని భయమేసింది. తనకి ఎంత మనసు వున్నా, భర్తకి తనమీద వున్న ప్రేమానురాగాలు తెలిసున్నా, తమ ఇంట ఆచారమయినవి భర్త కెదురుగా అడగడానికి ధైర్యం చాలలేదు ఆండాళుకి. లజ్జా సంకోచా లతో భర్తకేసి చూసింది ఆండాళు.

"విప్పి చూసుకోవోయ్, అవేమిటో!" అన్నాడు చిలిపిగా. దాంతో మరీ భయమేసింది.

అహా! అండీ!

ఓహో! అండీ!

తీసి చూడండీ!

చూసి కైకోండీ!!

అని రాగాలు తీస్తూ పొట్లం దారాలు విప్పటం మొదలెట్టాడు లక్ష్మణం. ఆండాళుకి కడుపులో భయంతో త్రిప్పినట్టయింది. పెరట్లోకి పోయి వాంతి చేసుకుని నూతి దగ్గర ముఖం కడుక్కుని 'టవల్'తో ముఖం తుడుచుకుంటూ 'ఈజీ చైర్'లో జారబడింది. వెంటనే చెంచాతో మాదీఫల రసాయనం తెచ్చియిచ్చాడు లక్ష్మణం. 'చివరకి నీ చేతుల్తో విప్పావేకాదు' అన్నాడు ఆకు పొట్లాం విప్పుతూ. దాన్నిండా స్వర్ణ సంపెంగ లున్నాయ్. ఆ సువాసనకి కళ్ళు అర మోడ్పుతో 'అమ్మయ్య!' అనుకుంది ఆండాళు భారంగా.

మర్నాడు భర్త ఆఫీసుకు పోగానే కూరలవాడి దగ్గర ఏబులం నీరు ఉల్లిపాయలూ, పంఫు వెల్లుల్లిపాయలూ కొన్నది ఆండాళు. అవి పదిలంగా కాగితంలో చుట్టి బీరువాలో తన చీరెలమధ్య దాచింది. సాయంత్రం బంగాళా దుంపలు, ఉల్లిపాయలూ వేయించుకొని తిందామనుకుంది. నాలుగు నీరుల్లిపాయలు పొట్టు నలిపి ముక్కలు తరుగుతూంటే, లక్ష్మణం వచ్చిపడ్డాడు దేవాంతకునిలా!

"అండీ ! 'నవరంగ్' పిక్చర్ కి టిక్కెట్లు 'బుక్' చేశాను. త్వరగా తెములు ! మళ్ళీవచ్చి సాపాటు చేద్దాము" అంటూ.

భర్త ఆఫీసునుంచి వచ్చేలోగా కూర చేసుకుని తిందా మనుకున్న ఆండాళు నిర్ఘాంతపోయింది ! ముందస్తుగా సినిమా ప్రోగ్రాం మాట తనతో చెప్పలేదు. అదిరిపోయి గమ్మున వలిచే ఉల్లిపాయలూ, తరిగిన ముక్కలూ గంజి గిన్నెలోనికి విసిరి, ముందు పేడతో, తర్వాత సబ్బుతో చేతులు కడుక్కొని ఇవతలికి వచ్చింది. ఆ రోజు సినిమా చూశామన్న సరదా కూడా లేదు. పాపం !

మర్నాడు 'ఇల్లా కాదు' అనుకున్నది ఆండాళు. భర్త ఆఫీసుకి పోగానే పకోడీలు మొదలెట్టింది. మూకుడులో నూనె ఎసరుపెట్టి శనగపిండి, కారం, ఉప్పు కలుపుకుని అల్లం, పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయల్లు సన్నగా తరుగు తూన్నది. ఇంతలో తలుపుత్రోసుకుని ప్రక్కింటి విమలమ్మ వచ్చింది. "ఏంచేస్తున్నావ్ ? నూలింతరాలా ? ఫలహార మేమిటి ? బజ్జీలా ?" అన్నది పీట వాల్చుకుని కూర్చుంటూ. ఆండాళు కాస్సేపు తటపటాయించింది. వస్తేవచ్చింది. నాకు తినాల్నుంది. చేసేసుకుంటాను" అనుకుంది. మళ్ళీ "అమ్మో ! ఈవిడ వూరంతా మోసేస్తుంది ఈ ఖబురు" అనుకుని భయ పడింది. స్వతహాః భయస్థురాలు. గమ్మున వుల్లిముక్కలు పెరట్లోకి గిరటేసి, రెండు అరటికాయలు తరిగి బజ్జీలు వేసింది. విమలమ్మ రెండు మైసూరుపాకు బిళ్ళలుఇచ్చి నోట్లోవేసికో !" అన్నది. స్టీలు పళ్ళెంనిండా బజ్జీలు' మీ పిల్లలకి పెట్టండి అని

విమలమ్మకి ఇచ్చింది అండాళు. ఈ తతంగమంతా పూర్తయ్యే సరికి పొద్దు వాటాలింది. పనిమనిషి రావటం' తిరిగివంట. లక్ష్మణాచార్యుల ఆగమనం. వీటితో సరిపోయింది. రాత్రి తెల్లవార్లూ అండాళుకి వుల్లిపాయలు వేపుడు, పకోడీలే కళ్లోకి వచ్చాయ్. తెల్లారిన దగ్గరినుంచి భర్త ఆఫీసుకి ఎప్పుడు వెళ్ళిపోతారా ! అని కాసుకూర్చున్నది. ఆఫీసుకి వెళ్ళగానే తలుపులు బిగించుకుని, పెసరపప్పు రుబ్బుకున్నది. అల్లం, పచ్చి మిర్చి, వుల్లిపాయలు సన్నగా తరుక్కుని ఇంక అట్లుపోసు కుందామని పెనం కాలేసిందో లేదో, వీధి తలుపు దబదబా బాదుతున్నారు. ఎవరో ? అండాళుకి కళ్ళనీళ్ళ పర్యంతమైనది. ఒక నిట్టూర్పువిడిచి వుల్లిముక్కలు పెరటిగుమ్మంలోంచి అవ తల పారవేసి మట్టితో వాసనపోయేదాక నూతిదగ్గర చేయి కడుక్కుని వీధితలుపులు తీసింది. ఎదురుగా అత్తగారు రాఘ వమ్మగారూ ! ఆడబిడ్డ తాయారూ ! అండాళు ముఖం పాలి పోయింది. "ఏంచేస్తున్నావమ్మా వదినా ? అన్నయ్య లేడు కదా అని తలుపులు బిగించుకొని నీ ఇష్టమువచ్చినవి వండుకు తింటున్నావల్లేవుంది !" అన్నది తాయారు పరిహాసంగా.

"ఆఁ చేసుకు తిన్నట్లేవుందీ దానిమొహం ? ఏమే ? అండాళ్లూ ? బొత్తుగా చీపురుపుల్లయ్యావ్ ? నాదగ్గర మొహ మాటం అయితే అమ్మకేనా ఉత్తరం వ్రాయలేకపోయా వుటే ? వెర్రిదానా !" అన్నది. రాఘవమ్మగారు. ఆదరంగా అండాళుని దగ్గరకు తీసుకుని.

ఆ పయిన ఆవిడ స్నానపానాలు, రుబ్బిన పిండి తాయారు అట్లు వేయటం, అత్తగారు తెచ్చిన పంచదార మినప సున్ని, అరిసెలు, చక్కెరకేళీలు నలుగురికి పంచటం, హడావుడితో జరిగిపోయాయి రోజులు. ఏడవ మాసందాకా వున్నారు ఆండాళు, అత్తగారూ, ఆడబిడ్డా. ఈ రెండు నెల్లూ తాను బజారుకు పోయేటప్పుడు ఆండాళు ఏదో కావాల్సిన దానిలా ముఖం పెట్టటం, తీరా తాను ఎంత బుజ్జగించినా చెప్పలేకపోవటం. ఇబ్బందిగా ఫీలయ్యాడు లక్ష్మణాన్న.

ఏడవ మాసం వెళ్ళబోతున్నదనగా ఆండాళు తల్లి రావంజమ్మ, అన్న భార్య అలివేలు కానుకలు తీసుకుని వచ్చారు, ఆండాళుని పురిటికి పలుచుకుపోదామని. నాలు గయిదు రోజులు పేరంటాళ్ళతో ఇల్లంతా సందడిలో మునిగి పోయింది. పిండివంటలతో నిండిపోయింది. కాని సూలింత వాంఛ తీరే ముచ్చట కనపడలేదు. ఎవ్వరితో చెప్తుంది? ఏమని చెప్తుంది? చెప్తే? అపహాస్యమేకదా! ఎంత చుట్టా లయితే మాత్రం? ప్రతీ క్షణం అమ్మతోనో, వదినతోనో చెప్దామనుకునేది. కాని మనస్సు ముందుకు తోస్తే "వాక్కు" వెనక్కి తీసేది. అత్తగారు అన్నది, ఆండాళు తల్లితో.

"ఏవమ్మాయ్ వదినా! మీ అమ్మాయికి ఏం కావాలో కాస్త తెలుసుకోవమ్మా! నేను నిక్షేపం చేసి పెట్టినా సయించటంలేదు దానికి, తల్లివికదా! దాన్ని కను క్కుని నాతో చెప్తే నేను చేస్తాను ఏదయినా! ఒక్కగాని

ఒక్క కోడలు. ఈ సమయంలో దానికిష్టమయినవి నా చేత్తో చేసి పెడితేకాని నాకు తృప్తిగా వుండదు."

"అహ్హ. హ్హ. హ్హ" పెద్ద నవ్వు నవ్వారు రావంజమ్మ గారు. "ఏమే అండీ! ఏం కావాలో చెప్పకూడదూ? అమ్మ పెట్టేవి రెండూ కావాలా ఏం?" అన్నారు రావంజమ్మగారు.

"చెప్పవమ్మా వదినా? చెప్పకపోతే పుట్టబోయే పాపడు చెవిలో "చీము" వస్తుందట! చూలింత బాలెంత అయ్యేలోగా మనసులోని కోర్కెలన్నీ తీర్చాలిట! మాలాంటి వాళ్ళం" అన్నది నవ్వుతోన్న అలివేలు.

"నిజంగానుటమ్మా వదినా? పాపడు చెవిలో "చీము" రావటం?" అన్నది ఆలోచనగా ఆండాళు, కళ్ళు ముఖం చిట్లించి.

ఇంకా అడుగుతున్నావా? ఏం? కొంపదీసి ఏ చేపల పులుసు మీదకో పోలేదుకదా నీ మనసు! మన శాస్త్రం వుండనే వున్నదిలే! "అంతా శ్రీవైష్ణవులే, రొయ్యల బుట్ట మటుకు మాయమైంది అని" అంది ఇంకా నవ్వుతూ అలివేలు.

తల్లీ, వదినా, ఆండాళుని ప్రయాణం కమ్మన్నారు. ఆండాళు సిగ్గుగా తలవూచి "నాల్రోజులు పోనీఅమ్మా!" అన్నది. తాయారు, అలివేలు, విరగబడి నవ్వారు.

"తెలిసిందిలే! నీకథంతా తెలిసిందిలే! మేమంతా వెళ్ళిపోయాక వంటెగా మా అన్నయ్యతో సినిమాలకి షికారకి పోవాలని కదూ నీమనసు! ఇద్దరూ కలిసి వేసుకొన్న

పథక మన్నమాట మాతో రాక పోటం'' అంటూ గోల చేసారు. ఆండాళు మూతి ముడుచుకుని కోపానికి అభినయం పట్టి దొడ్లోకిపోయి కూర్చున్నది."

"అసుర సంధ్యవేళ ఆరుబయట కూర్చోకమ్మా వదినా ? మామీద కోపంవస్తే రానీకాని." అంటూ ఛామంతిపూల చెండు తెచ్చి జడలో తురుముతూ చెంపలు నిమిరింది. ప్రేమగా అలివేలు. మర్నాటికి ఇల్లంతా నిశ్శబ్దం. రెణ్నెల్ల బట్టి అలవాటు పోగొట్టుకున్న పనన్నిటినీ నెమ్మదిగా చేస్తున్నది. ఆండాళు. లక్ష్మణం వంటింటి గడపమీద కూర్చొని, భార్యలోని, నిండుతన్నాన్ని ఆమె కళ్లల్లోని బరువుతో కూడిన సిగ్గునూ, అప్పుడప్పుడు కారణం లేకుండానే, రాగరంజిత మగుతున్న చెక్కిళ్లనూ, చూస్తున్నాడు. ఆండాళు కళ్లముందు. వుడికి తళ తళ మెరుస్తూన్న, వుల్లిముక్కలు, వేగి నల్లబడి, కమ్మనివాసన వేసే వుల్లిముక్కలూ, మెదుల్తున్నాయ్. వుండుండి నాలిక తడుపుకుంటూ భర్తకేసి చూసింది.

"ఏమిటే అండీ? అదోలావున్నావ్ ?" అన్నాడు లక్ష్మణం. "ఏంలేదులెండి. సాదంలోనిక్కి (అన్నం) ఏంచేయ మంటారు ?" అన్నది. ఆ క్షణంలో భర్త నీరుల్లి, వెల్లుల్లి పాయలు తెచ్చి తనముందు రాసిపోసి.

"చూడు అండీ ? కాసిని వుల్లిపాయలు పప్పులుసు కాచు ! కాసిని బంగాళాదుంపల ముక్కలతో కలిపి వేయించు ! సాయంత్రం పెసరట్టుల్లోకి కొన్ని దాయి ! మధ్యాహ్నం ఫల

ఫారం. పకోడీలు పొయ్యి! "వెల్లుల్లి" కంది పచ్చడిలోనికి, గోంగూర పచ్చడిలోనికీ వేయించి పొయ్యి! కాసిని తెలక పిండి పొడుములోనికీ, క్యారపొడిలోనికీ దాయి!" అంటే బాగుండుననిపించింది ఆండాళు ప్రాణానికి లక్ష్మణం నవ్వి "నా ఇష్టానిష్టాలేం పనికివస్తయ్ ఈ రోజుల్లో! నీకు ఏది తినాల్నుంటే అదే చెయ్యి!" అన్నాడు. భోజనంచేసి ఆఫీసుకు పోబోతూ రుమాలుకోసం ఆండాళుని కేకేశాడు లక్ష్మణం.

"నా బీరువాలో వున్నాయేమో చూసుకోండి. నాది మడిబట్ట. సాపాటు అయితేగాని మైలపడను" అన్నది వంటింట్లోంచే ఆండాళు. రుమాలుకోసరం బీరువా అడుగునుంచి పైకీ, పైనుంచి క్రిందకీ కెలుకుతూంటే కాగితపు పొట్లం క్రింద పడింది! విప్పిచూస్తే ఉల్లిపాయలు! ముందు ఆశ్చర్యపోయినా, నెమ్మదిగా వంటింటివేపు నడిచాడు. "అండీ! రుమాల్ములు ఏదో వాసన వేస్తుందే?" అన్నాడు. లక్షణమైన నవ్వు మొహంతో.

"ఏం వాసనండీ! మొన్న పేరంటంలో రెండు సెంటు సీసాలు మిగిలితే నా బీరువాలో పడేశాను. ఏం! బాగు లేదా? రెహనావో, నూర్జహానోట! నాకు బాగా తెలియదు" అంది తలవంచుకుని అన్నం తింటూన్న ఆండాళు.

"హుం. సెంటు వాసన అయితే బాగానే వుండేదే! మరేదో వాసనవచ్చిపడిందేమిటాఅని"అన్నాడు ఆలోచిస్తోన్నట్లుగా. ఇప్పటికి తెలిసివచ్చింది ఆండాళుకి. దెబ్బతిన్నట్టుగా తలెత్తి అతని చిలిపి కళ్ళల్లోకి జాలిగా చూసింది.

"ఫూం. నాతో చెప్పకపోయావే అండీ! ఈమాత్రం కోరిక తీర్చటానికి నే తగనూ?" అన్నాడు అప్యాయంగా.

సాయంత్రం ఆఫీసునుంచి వస్తూనే రామయ్య హోటలు లోనికి దారితీశాడు.

"వుల్లిపాయ పెసరట్టువుందా?

"ప్రొద్దుటే వుంటుందిసార్!"

అన్నాడు సర్వర్

"పోనీ పకోడీ?

"జీడిపప్పుది వున్నదిసార్!"

విసుగ్గా "పోనీ ఇడ్లీలోనిసాంబార్?"

"ఇవ్వాళ ములక్కాడ సాంబార్ సార్" అన్నాడు సర్వరు. లక్ష్మణాచార్యుల వుల్లిమమకారానికి విస్తుబోతూ. పీడ ముఖం ఈడ్చెయ్యా. వెధవ వూరు వెధవ్వూరాని అయ్ని కాడికి తమిళ సోదరుల నందరినీ వెళ్లగొట్టాలంటే ఏమవుతుంది మరి! ఇంతపెద్దవూరికీ ఒక్కటంటె ఒక్కటే హోటలు. తగల డిందాయె!" అని తిట్టుకుంటూ తన సోదరప్రేమని బహిర్గతం చేశాడు లక్ష్మణాచార్యుడు.

తెల్లారిలేస్తూనే కాఫీత్రాగి హోటలు ముఖం పట్టాడు. లక్ష్మణం.

"రాండిసార్! రండి! బోణీకొట్టండి. ఇప్పుడే. వేడి, వేడి' తాజా తాజా!" అంటూ గబగబా నాలుగు పెసరట్లు వుల్లిముక్కలు బాగావేసినవి చూసి తెచ్చిఇచ్చాడు సర్వర్.

ఆపొట్లాన్ని జాగ్రత్తగా రుమాలులోకట్టి తెచ్చాడు. ఒక్క పరుగులో ?

"అండీ! అండీ! గమ్మునరా!" అన్నాడు సంతోషంతో. భర్తకి తనయందుండే అమిత ప్రేమానురాగాలికి శ్రద్ధా భక్తులతో ఆనందంతో కళ్లు చెమర్చుతుండగా నెమ్మదిగా ఆండాళు వచ్చింది. రుమాలువిప్పి దారంవూడదీస్తుంటే తలుపు త్రోసుకుని "ఏమి అమ్మాయ్! ఏంచేస్తున్నారే!" అంటూ ఆండాళు అన్నగారు వెంకటాచార్యులు వచ్చాడు. రాక రాక అన్నగారు వచ్చినందుకు సంతోషించాలో! తన ఈప్సితార్థము తీరనందుకు చింతించాలో తెలియక బిత్తర పోయింది. ఆండాళు.

"వాసే అమ్మాయ్! ఇవ్వాళ మంచిరోజట! మళ్ళీ మూఢమి వస్తుందని శాస్త్రులుగారు చెప్పారుట అమ్మతో! నిన్నివ్వాళ్లే తీసుక రమ్మంది. బావా? బెంగెట్టుకోకోయ్! మళ్ళీ మూడవమాసంలో పుత్రసమేతంగా పంపిస్తాంలే మా చెల్లిని!" అన్నాడు. వెంకటాచార్యులు. భర్తవైపు బెంగగా చూసింది ఆండాళు. విప్పబోతున్న పొట్లాన్ని కిటికీ లోంచి గిరాటెట్టి చేతులు నలుపుకుంటున్న లక్ష్మణం ఆండాళుకేసి జాలిగాచూసి "సరే ఉత్తరాలువ్రాస్తూండు. ఎప్పటికప్పుడు" అన్నాడు.

పుట్టింటికి వెళ్ళిన దగ్గరనించి మరీ యాతనగావుంది. ఆండాళుకి. అది శుద్ధపల్లెటూరు. తన అభిమతం ఎవరితో చెప్తుంది? ఆవూరికి వాళ్లే ఆచార్యులు! నెలలు నిండినకొద్దీ

ఆండాళుకి పుల్లిపాయలు తినాలనేవాంఛ ఎలావున్నా "చంటాడు"కి చెవిలోచీము వస్తున్నదనేభయం ఎక్కువయింది. కన్నులు మూసినా తెరిచినా పనసపండులాంటి పాపడు! వాడి చెవిలో తడి తడిగా చీమూ! కన్పిస్తున్నాయ్ ఆండాళుకి. మనోనేత్రానికి గోచరమయ్యే దృశ్యం ఇదేనాయె! దానికి తనదేకదా బాధ్యత? అది ఎలా తీరుతుంది? చెప్పరాని మూగబాధ అనుభవించేది. లక్ష్మణం ఉత్తరాల్లో "ఎలావున్నావు నీ కోరికతీరిందా!" అని పదే పదేగా వ్రాస్తుండేవాడు. జవాబు ఏమనివ్రాసేది? నయం! ఇంకా! భర్తతో చంటాడు చెవిలో చీముగురించి చెప్పనేలేదు తను. తెలిసిందంటే ఎంతమందిలోనయినా తనచేత "పుల్లిపాయలు" తినిపించేవారే? చాలా సాహసులు ఆయన. భర్త ప్రజ్ఞా విశేషాలు తలపుకురావటంతో ఆండాళుకి ఆనందంలో శరీరం నిలువునా జలదరించేది.

ఆరోజు వైకుంఠ ఏకాదశి! రామాంజమ్మగారూ అలివేలు వుపవాసం వున్నారు. అన్నగారికీ ఆండాళుకీ అలివేలు వండిపెట్టింది. ఆండాళు నిండునెలలుతో కదలలేదని! సాయంత్రం వెంకటాచార్యులు "పాలేనికి జడితోలుకెళ్తూ" అమ్మా "భక్త అంబరీష" సినిమావుందట. పాలెంలో. వస్తారేమిటే? అన్నాడు. అన్నగారు సినిమాపేరెత్తగానే ఆండాళుకి పోయినదేదో దొరికినట్లుగా సంబరపడింది. "వెళ్లండే అమ్మా! సరదాగా! ఎటూ రాత్రి పదకొండయ్యేసరికి వచ్చేస్తారుకదే!" అన్నది వుత్సాహంగా.

నేనుంటా ! ఆండాళుదగ్గర ! మీా రెళ్ళండి ? అత్తా !" అన్నది. అలివేలు ఇంటి కోడలుగా బాధ్యతతో.

"ఇద్దరూ వెళ్ళరూ ! ఇంతలో మునిగిందేమిటి ! నేనున్నానుకాబట్టే ఇద్దరూ వెళ్ళండి సరదాగా ! నే లేకపోతే ఇద్దరూ చెరొకసారీ వెళ్ళాల్సిందే. కాదూ ?" అని వాదించి వాదించి వాళ్ళని వొప్పించి ప్రక్కవూరికి సినిమాకు పంపింది ఆండాళు తల్లినీ వదిననూ నెమ్మదిగా. వీధి తలుపు జారవేసి పెరట్లోంచి ప్రక్కింటి శాస్త్రిలుగారింటికి వెళ్ళింది ఆండాళు. బామ్మగారు వుల్లిపాయలు వలుస్తూ "దామ్మా ! దా ! కూర్చో !" అన్నది సాదరంగా.

"ఏం చేస్తున్నారు బామ్మగారూ? రాజీలేదా! అన్నది. అది వుంటుందా అమ్మాయ్ ! మీా వెంకటి బండి తెచ్చాడో లేదో ముందే ఎక్కి కూర్చుంది సినిమా కని ! నీకు ఇంకా భగవంతుడు ఎప్పుడు తేలిక చేస్తాడో ఏమో !" అన్నది అనునయంగా.

రాత్రికి ఏం వండుతున్నారు ?" అన్నది మామూలు ధోరణిగా.

ఇదిగో ! ఈ సాలిగ్రామాలు పులుసు పెడతానుగా". అంది నవ్వుతూ చేతిలోనివి చూపెడుతూ. ఇంతలో పొయ్యి మీాద "సయ్" మని చప్పుడయింది. కూర్చో అమ్మా ! పొయ్యిమీాద అన్నం వార్పుకు వచ్చింది" అంటూ వంట గదిలోకి వెళ్ళింది బామ్మగారు. ఆండాళు చప్పున తరిగిన వుల్లిముక్కలు చెంగులో కొన్ని పోసుకొని "వెళ్తా బామ్మగారు ! కాసేపు పడుకుంటాను. నడుం నొప్పిగా వున్నది." అని

చరచరా వెళ్ళిపోయింది. "కాస్త కొబ్బరి చలిమిడి ఇస్తా! తీసుకెళ్ళవే అమ్మాయ్" అన్న బామ్మగారి మాట గాలిలో కలిసి పోయింది.

చిన్న సత్తుగిన్నెలో చిక్కగా చింత పండురసం. కాస్త బెల్లపుపొడీ, వుల్లి ముక్కలూ, పచ్చిమిరప ముక్కలూ, వుప్పూ పసుపూ అన్నీ వేసి కుంపటిమీద పెట్టి విసురుతూ కూర్చుంది ఆండాళు. అది మరిగి తెర్లుతూండగా ఆ ఆవిరి మీద రెండు అరచేతులు బోర్లించీ ఆ వాసన ముక్కుదగ్గర పెట్టుకొని పీలుస్తూ గుటకలు వేసుకుంటూ కూర్చుంది ఆండాళు. అది మరగాలి! చల్లారాలి! తన కడుపు నిండా తినాలి. చీడీ క్రింద పారిజాతం చెట్టు మొగ్గలు ఒక్కటొక్కటే విచ్చుతున్నాయ్. దొడ్లో బాదం చెట్టు సంగతి సందర్భాలను గ్రహించినట్లుగా ఆకుల తలలూపింది. ఆ చలిగాలిలో ఆండాళు కళ్ళముందు, స్టీలు పళ్ళెల్లో, బంగాళా దుంపలూ వుల్లిపాయల వేపుడు, పెసరట్లూ, పకోడీలూ, కందిపచ్చడీ గిరగిరా తిరుగుతున్నాయ్. ఆండాళు ఒక్కసారి దగ్గరగా ముడుచుకుంది. కడుపులో ఏదో బాధ! వాంతి వస్తుందా అనిపించింది. చివరికి ఆండాళు గ్రహించింది తన బాధ ఏమిటో!

గమ్మున సత్తుగిన్నె దింపి పులుసు బురదగుంటలో దిమ్మరించి, గిన్నె బాదంచెట్టు దగ్గర "బాడి"లో దిగకొట్టి, నులకమంచంమీద జారపడింది, బామ్మగారిని కేకేసి!.

ఆ రాత్రి రావంజమ్మగారు, అలివేలూ వచ్చేసరికి, పెద్దగసం మామిడి పండంత పిల్లవానికి నీళ్ళు పోస్తున్న నాటు మంత్రసాని వీరమ్మా, బాలింతకి నడుం బిగిస్తున్న బామ్మ

గారూ కనపడ్డారు. కులుకుతూ మేనల్లుడి వంక చూస్తున్న అలివేలుతో

"వాడిచెవిచూడు వదినా? చీముకాని రావటంలేదు కదా?" అన్నది. ఆండాళు సోలిపోతున్నకళ్లతో నూతన మాతృత్వపు మమకారంతో చూస్తూ.

నీరసంగా అడిగిన ఆప్రశ్న—రామంజమ్మగారు. "చిన్న సత్తుగిన్నె ఏదే అలివేలూ?" అని అడుగుతున్న కంచులాంటి కంఠధ్వనిలో అలివేలుకి వినపడనేలేదు.

బావమరిది యిచ్చిన "టెలిగ్రామ్" చూస్తూనే "కొల్లీగ్స్"ని హోటలుకి ఈడ్చుకునిపోయి.

"ఉల్లి పెసరట్టూ, పకోడీ" ఆర్డరు జారీచేశాడు సర్వరుకి లక్ష్మణాచార్యులు.

"ఆచార్లూ! పుత్రోత్సవం అయితే స్వీట్సు ఇప్పించాలి కాని, ఇవేమిటోయ్ నోరు మండిపోతోనూ, మేం తినలేం బాబూ! స్వీట్సు రానీయి" అన్నారు.

"ముందు ఇవి కానీయండోయ్ బాబులూ! అన్నీ వస్తాయ్ వరసనే" అన్నాడు లక్ష్మణం సముద్రునిలా పొంగిపోతూ.

అవి ప్రత్యేకంగా ఎందుకుఇప్పిస్తున్నాడో ఈ "ఆచార్యులు" అని తెలియకపోయినా "లంచ్ టైం" ఆవటంనించి ఆవు రావురుమని తింటున్నారు) వాళ్లు.

ఆ వుల్లిముక్కల్లో ఆండాళ్ళుముఖం పిల్లవానిముఖం లీలగా కన్పించి తృప్తిగా నవ్వుకున్నాడు లక్ష్మణాచార్యులు!